## క్లుప్తంగా

### ముగిసిన 'ఆపస్' సదస్సు



ఆపస్ సమావేశంలో ఉపాధ్యాయులు

**ఆరిలోవ:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర స్థాయి 'ప్రాంత అభ్యాస వర్గ' సదస్సు మంగళవారం ముగిసింది. విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కాలేజీ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు తదిత రవాటి గురించి ఆపస్ నాయకులు వివరించారు. విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతుల గురించి చర్చించారు. కార్యక్రమంలో పలు జిల్లాలకు చెందిన ఆపస్ సంఘం కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నీతి కథలతో ఉన్నత భావాలు



కథలు చదువుతున్న విద్యార్థులు

**మురళీనగర్:** విద్యార్థులు నీతి కథలు చదవడం వల్ల ఉన్నత భావాలు ఏర్పడతాయని గ్రంథాలయ ఉద్యమకర్త దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం నీతి కథల పఠన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెద్దల పట్ల గౌరవం, జీవితాన్ని క్రమశిక్షణతో గడపడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కథలు చెప్పించి, కథలు చదివించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీచర్ విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులకు కథలు చెప్పారు.

### టాస్క్‌ఫోర్స్ అదుపులో గంజాయి నిందితులు

**తాటిచెట్లపాలెం:** రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను మంగళవారం టాస్క్‌ఫోర్స్, ప్రొహిబిషన్, మద్య నిషేధ స్టేషన్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారు తెలియజేసిన వివరాలు ఇలా.. విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో జ్ఞానాపురం ప్రవేశ ద్వారం బయట ప్రొహిబిషన్, మద్య నిషేధ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ప్రొహిబిషన్, మద్య నిషేధ ఇన్‌స్పెక్టర్ బి. నాగవేణి తెలిపారు.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సత్యకుమారికి నారీశక్తి అవార్డు



నారీశక్తి అవార్డు అందుకుంటున్న సత్యకుమారి

**సీతంపేట:** నగరానికి చెందిన సామాజిక సేవకురాలు డబ్ల్యూ.సత్యకుమారికి ప్రతిష్టాత్మకమైన నారీశక్తి అవార్డు లభించింది. ప్రజలు, విద్యార్థులకు సత్యకుమారి చేస్తున్న సేవను గుర్తించిన న్యూఢిల్లీకి చెందిన దూత్రా దర్శక్ ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఉమెన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ కేటగిరీలో అవార్డును ప్రకటించారు. ప్రముఖ నటి సుధాచంద్రన్, మిసెస్ ఇండియా మంజరి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. సత్యకుమారి 14 ఏళ్లుగా బీపీవోగా విధులు నిర్వర్తిస్తూ, సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

# మార్పునకు సాగరతీరమే సాక్షి

**సాక్షి ఎఫెక్ట్..**

ప్రతీ అక్షరం ప్రజా సంక్షేమాన్ని కాంక్షించింది. నగరానికే మణిహారంగా నిలిచే సాగర తీరాన్ని మరింత ఆహ్లాదంగా మలిచే ప్రయత్నం చేసింది. ప్రజలు, పర్యాటకుల అవసరాలను ఎప్పటికప్పుడు కథనాలుగా ప్రచురించింది. ప్రజల పక్షాన నిలుస్తూ అందించిన కథనాలు అధికారుల దృష్టికి వెళ్లాయి. స్పందిస్తూ, సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు. దీంతో సాగర తీరం కొత్త శోభను సంతరించుకుంటోంది. వివిధ సందర్భాలలో సాక్షిలో ప్రచురితమైన కథనాలు అధికారులను కదిలించి చేసిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపుతోంది ఇలా..

**- ఏయూక్యాంపస్**

- ప్రతీ కథనానికి స్పందించిన అధికారులు
- సాగర తీరానికి కొత్త సొబగులు
- ప్రభుత్వానికి సమకూరుతున్న ఆదాయం

### బెంచీల ఏర్పాటు



విరిగిన బెంచీలు



నూతనంగా ఏర్పాటు చేసిన బెంచీలు

సాగర తీరంలో సాయంత్ర వేళలో వచ్చే పర్యాటకులు కూర్చునేందుకు తగిన బెంచీలు లేకపోవడం గుర్తించిన సాక్షి దీనిపై ప్రత్యేక కథనం ప్రచురించింది. వైఎంసీఏ నుంచి ఆర్.కె. బీచ్ వరకు పదుల సంఖ్యలో దెబ్బతిన్న బెంచీలు, ఇనుప ఊచలు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్న విధానాన్ని కథనంగా మలిచి అందించింది. దీనిపై స్పందించిన అధికారులు తీరం పొడవునా నూతన బెంచీలను ఏర్పాటు చేశారు.

### ఆట వస్తువులకు కొత్తరూపు



పాడైపోయిన ఆట వస్తువులు



కొత్తగా ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో చిన్నారుల ఆటస్థలంలో పలు ఆట వస్తువులు విరిగిపోవడం, శిథిలమవడం గుర్తించి ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆట వస్తువులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్తవాటిని ఏర్పాటు చేశారు. దీంతో సాయంత్రం పార్క్‌కు వచ్చే చిన్నారులకు కాస్త ఆటవిడుపు లభిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన ఆట వస్తువుల నాణ్యత, నిర్వహణపై అధికారులు కాస్త దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### వెల్లివిరిసిన పచ్చదనం



చెట్లు ఎండిపోయి కళావిహీనంగా..



కొత్త మొక్కలతో ఆహ్లాదకరంగా..

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో కొన్ని చెట్లు ఎండిపోయి, మోడువారాయి. వీటిని తొలగించి కొత్త మొక్కలు నాటాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ ప్రచురించిన కథనాన్ని పరిశీలించిన అధికారులు కొత్త మొక్కలను నాటించారు. ప్రస్తుతం మొక్కలతో పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. దెబ్బతిన్న మొక్కలు, చెట్ల స్థానంలో కొత్తవి నాటడం, సంరక్షించడం ఎంతో అవసరం.

### బొమ్మలు కళాత్మకంగా..



విరిగి కళావిహీనంగా ఉన్న ఏనుగు బొమ్మలు



మరమ్మతులు చేసి రంగులు వేసిన అనంతరం ఇలా..

తీరానికి వచ్చే సందర్శకులు ఎంతో ఆసక్తిగా ఫొటోలు తీసుకునే పాయింట్లు డ్రాగన్ పార్క్, ఏనుగు బొమ్మ. డ్రాగన్ బొమ్మ పెచ్చులు ఊడిపోగా, ఏనుగు బొమ్మ తోక, తొండం విరిగిపోవడం, రంగులు వెలిసిపోయాయి. దీనిపై వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు వీటికి మరమ్మతులు చేసి కొత్తవాటిలా తీర్చిదిద్దారు.



డ్రాగన్‌పార్క్‌లో విరిగిన బొమ్మ



మరమ్మతులు చేసి, రంగులు వేసిన అనంతరం సుందరంగా..

### ఫౌంటైన్ 'కళకళ'



కళావిహీనంగా ఫౌంటైన్



రంగులు వేసి సుందరంగా ఫౌంటైన్

బీచ్‌రోడ్డులో ప్రధాన కూడళ్లలో ఒకటైన పార్క్ హోటల్ జంక్షన్ వద్దనున్న ఫౌంటైన్ మురికి పట్టి కళావిహీనంగా మారింది. దీనిపై ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మరమ్మతులు చేసి, రంగులు వేసి కొత్తగా తీర్చిదిద్దారు. దీంతో ఈ కూడలికి మరింత శోభ చేకూరింది.

### వినియోగంలోకి మైదానాలు



నిరుపయోగంగా మైదానాలు



మైదానాల వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డులు

వీఎంఆర్డీఏ పరిధిలో ఉన్న మైదానాలు నిరుపయోగంగా ఉండటంపై ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. వుడాపార్క్‌లోని మూడు మైదానాలు, సబ్‌మెరైన్ వద్ద ఉన్న ఖాళీ ప్రాంతాలను ప్రజలకు అద్దెకు ఇస్తామంటూ ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేశారు. మైదానం కెపాసిటీ, ఇతర వివరాలు తెలియజేస్తూ, సంప్రదించడానికి ప్రత్యేకమైన ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో వివిధ కార్యక్రమాల కోసం వీటిని అద్దెకు తీసుకోవడం జరుగుతోంది. తద్వారా ఆదాయం సమకూరుతోంది.

### ఫుట్‌పాత్‌లు పరిశుభ్రం

తినుబండారాలు, వ్యర్థాలను ఫుట్‌పాత్‌పై వేయడంతో అధ్వానంగా మారుతున్నాయి. అదే విధంగా టపాసులు కాల్చడం వంటివి చేయడంతో మురికి పట్టి అసహ్యంగా కనిపిస్తున్నాయి. దీనిపై గతంలో ప్రచురించిన కథనానికి స్పందిస్తూ ఫుట్‌పాత్‌లను యంత్రంతో శుభ్రం చేస్తున్నారు.

## కొనసాగుతున్న ఎన్‌ఎంయూఏ రిలే నిరాహారదీక్షలు



ఎన్‌ఎంయూఏ నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

**ఎంవీపీకాలనీ:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూఏ (నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్) వాల్తేర్ డిపో ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 2వ రోజు కొనసాగాయి. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు ఈ దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నైట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400లకు పెంచాలన్నారు. దీంతో పాటు త్వరలో వినియోగంలోకి రానున్న ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ ఉద్యోగుల ద్వారానే నడపాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో ఉద్యోగులకు పాతవిధానంలోనే వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, అక్రమ సెస్పెన్షన్, అక్రమ రిమూవల్స్ ఆపాలని, డబుల్ డ్యూటీకి వచ్చే అలవెన్స్‌లను పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీయూఎం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యహాస్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఈ.రావు, సీసీఎస్ డెలిగేట్లు కేటీ రావు, పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికలకు వేసవి శిక్షణ శిబిరాలు

**మే 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహణ**



మాట్లాడుతున్న ఏసీడీపీవో శ్రీలత

**మద్దిలపాలెం:** విశాఖ అర్బన్ పరిధి ఐసీడీఎస్ ప్రాజెక్టులలోని అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు ఏసీడీపీవో శ్రీలత తెలిపారు. శిక్షణకు సంబంధించిన అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులకు మద్దిలపాలెం సెక్టార్ పరిధిలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిక్షణలో భాగంగా కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల హక్కులు, చట్టాల గురించి వివరించాలని సూచించారు. బాల్యవివాహాల కట్టడి, బాలికల అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి చర్చించారు. ప్రాజెక్ట్ అధికారి ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ వి.సెలియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా రక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి 1:40 ఉండాలి

**డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల వినతి**



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

**ఆరిలోవ:** పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:40 ఉండే విధంగా అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఐక్య కూటమి తరఫున ఎస్టీయూ, పీఆర్‌టీయూ నాయకులు, హెచ్‌ఎం అసోసియేషన్ సభ్యులు మంగళవారం డీఈవో ఎస్.ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని అందులో పేర్కొన్నారు. అయితే విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:53 నిర్ణయించడం మాత్రం మంచి విధానం కాదన్నారు. దీని వల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. దీంతోపాటు తరగతి గదిలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల పర్యవేక్షణ కూడా లేకుండా పోతుందన్నారు. నాయకులు ఇమంది పైడిరాజు, డి.గోపీనాథ్, కృష్ణకుమార్, ఎం.శ్రీనివాసరావు, బాబూలాల్, వేణుగోపాలరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



కిడ్నీ బాధితునికి నగదు అందిస్తున్న శ్యాంసుందర్

**సీతంపేట:** కిడ్నీ బాధితునికి స్వరాలయ స్టూడియో బాసటగా నిలిచింది. విజయనగరం జిల్లా గుర్లవింద పేటకు చెందిన అంపిల్లి లక్ష్మణరావు ఎండాడలోని అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబంతో ఉంటున్నాడు. తరచూ అనారోగ్యం బారిన పడుతుండటంతో వైద్య పరీక్షలు చేయించుకోగా కిడ్నీ సంబంధిత వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయింది. వైద్య పరీక్షల అనంతరం కిడ్నీ పాడైనట్టు నిరారణ అయింది. 5వ స్టేజ్‌గా గుర్తించారు. చికిత్సతో నయం కాదని, కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు సూచించారు. బాధితుని తల్లి బంగారమ్మ కిడ్నీ దానం చేయడానికి ముందుకు వచ్చింది. కిడ్నీ మార్పిడికి సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో, ఏం చేయాలో పాలుపోని స్థితిలో అక్కయ్యపాలెంలోని స్వరాలయ స్టూడియో అధినేత శ్యాంసుందర్ బాధితునికి రూ.33 వేలు నగదు ఆర్థిక సాయంగా అందించారు. దాతలు ఆర్థిక సాయం అందించాలని లక్షణరావు కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సాయం చేయదలచిన వారు 86880 52887 ఫోన్ నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

## బీసీ నేత శంకరరావు అరెస్ట్ దుర్మార్గం

**కూటమి ప్రభుత్వంపై మండిపడ్డ బీసీ సంఘాలు**



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

**ఎంవీపీకాలనీ:** బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అరెస్టును విశాఖ జిల్లా సంఘం నాయకులు ఖండించారు. బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవల విజయవాడలో నిరసనకు దిగిన శంకర్‌రావును కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని సంఘం నాయకులు తప్పుబట్టారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలోని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావును అరెస్ట్ చేయడం సరికాదన్నారు. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాల్లో బీసీలకు రావాల్సిన వాటాను ప్రభుత్వం ఇవ్వాల్సిందేనన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వానికి వినతులు ఇవ్వడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతున్న శంకర్‌రావుపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం కూటమి ప్రభుత్వం బీసీల కులగణన వెంటనే చేపట్టాలని, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం పోరాడుతున్న 70 ఏళ్ల వయసున్న శంకర్‌రావును ప్రభుత్వం దుర్మార్గంగా అరెస్ట్ చేసిందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే రాష్ట్రంలోని బీసీ సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు, విశాఖ గౌరవ అధ్యక్షుడు కామన వెంకట సుబ్బారావు, బీసీ, ఎస్టీ మైనారిటీ సంఘం నాయకుడు కట్ట మల్లేశ్వరరావు, సంఘం కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హనీ గ్రూప్ మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న హనీగ్రూప్ వ్యవస్థాపకుడు ముక్కా ఓబుల్ రెడ్డి, సిబ్బంది

**ఎంవీపీకాలనీ:** హనీ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎంవీపీ కాలనీలో ఉన్న కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరానికి ఉద్యోగులతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్, ఏఎస్ రాజా, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ, రోటరీ క్లబ్ విజయనగరం, మదర్, అమ్మ, విజయశ్రీ, విమ్స్, లైఫ్‌షేర్ బ్లడ్ సెంటర్ల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 530 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా హనీ గ్రూప్ వ్యవస్థాపకుడు ముక్కా ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే కార్యక్రమంలో భాగస్వాములవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ఉద్యోగుల నుంచే కాకుండా ప్రజల నుంచి కూడా మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో వ్యాపారులు చురుకైన పాత్ర పోషించడానికి ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## డీఎస్సీలో నాన్‌లోకల్ శాతాన్ని తగ్గించాలని వినతి

**ఎంవీపీకాలనీ:** డీఎస్సీ నోటిఫికేషన్‌లో నాన్‌లోకల్ శాతాన్ని తగ్గించాలని నిరుద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కోరారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. డీఎస్సీలో నాన్‌లోకల్ పోస్టులుగా రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం కేటాయించిందని, గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో నాన్‌లోకల్‌కు కేవలం 5 శాతం పోస్టులే కేటాయించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్‌లో నాన్‌లోకల్ పోస్టుల శాతాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ లేనందున ఉద్యోగ వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, టెట్ అర్హత పొందిన ప్రతి అభ్యర్థి డీఎస్సీ రాసేందుకు అనుమతించాలని కోరారు.

## పాలిసెట్ ఏర్పాట్ల పరిశీలన

**ఏయూక్యాంపస్:** పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్ ఏర్పాట్లను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు పరిశీలించారు. బీచ్‌రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని మంగళవారం సందర్శించి, సిబ్బందికి సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డి.వి నరసింహారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, పరీక్షల పరిశీలన అధికారి సి.హెచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌ఎస్‌ఎస్ జోనల్ అధికారిగా డాక్టర్ ఉమామహేశ్వరరావు



ఉమామహేశ్వరరావు

**మద్దిలపాలెం:** డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృత ఉపన్యాసకులుగా, జాతీయ సేవా పథకం అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు జోనల్ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన జాతీయ సేవా పథకం కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించనున్నారు. గతంలో యూనివర్సిటీ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి ఉత్తమ జాతీయ సేవా పథకం అధికారిగా అవార్డులు పొందారు. ఉమామహేశ్వరరావు నియామకంపై ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.హరనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.